క్లుప్తంగా

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

వెల్దండ: మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శనివారం ఉదయం 11గంటలకు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ గార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయంలో అఖండ దీపారాధన, విఘ్నేశ్వరపూజ, స్వామివారి అభిషేకం, నవగ్రహపూజలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ

అచ్చంపేట: పట్టణానికి చెందిన రాందాస్‌నాయక్ జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. హర్యానాలోని కురుక్షేత్ర ద్రోణచార్య స్టేడియంలో జరుగుతున్న 4వ జాతీయస్థాయి మాస్టర్ పోటీల్లో 35 ఏళ్ల పైబడిన విభాగంలో 5కిలో మీటర్లు వాకింగ్ పోటీల్లో మొదటి స్థానం సాధించినట్లు జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎద్మ శ్రీనుయాదవ్ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

తాడూరు: ప్రపంచ తొలి మహిళా చెస్ చాంపియన్ వేరా జయంతి ఉత్సవాలను శుక్రవారం క్లాస్‌మేట్ క్లబ్ తాడూరు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. అనంతరం చెస్ బోర్డులతో పాటు నోట్ పుస్తకాలు అందించిన నిఖిల్, క్లబ్ వ్యవస్థాపకులు రాఘవేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు సైదులు, కార్తీక్, శిల్ప, జహారా బేగం ఉన్నారు.

గ్రామాల్లో వందశాతం పని కల్పించాలి

చారకొండ: గ్రామాల్లో ఉపాధి పనుల ద్వార కూలీలకు వందశాతం పని కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ పండరినాథ్, ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం

తెలకపల్లి: మండల పరిధిలోని రామగిరి శివాలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం శివాలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గంటమఠం నాగభూషనయ్య వేదమంత్రాలతో జరిగిన మహాకల్యాణానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో పూజారులు నాగభూషనయ్య, రాచయ్య, ప్రభు, శివయ్య పాల్గొన్నారు.

కనులపండువగా ప్రభ ఊరేగింపు

లింగాల: మండల కేంద్రానికి సమీపంలోని శివాలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రభ ఊరేగింపు కనులపండువగా నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన వాహనంలో శివ పార్వతుల విగ్రహాలను ఉంచి, మహిళల కోలాటాలు, భజన కీర్తనలతో పట్టణం వీధుల గుండా చెన్నంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న శివాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని శుభాష్‌నగర్‌లో వెలసిన వెంకటేశ్వర స్వామి దేవాస్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆలయంలో పూజా కార్యక్రమాలతో పాటు భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. శుక్రవారం గరుడ సేవతో ఉత్సవాలు ముగిశాయి. శనివారం ఆలయంలోని మహాశివుడికి శివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకం తదితర ఏర్పాట్లు చేసినట్లు మనోహర్ తెలిపారు.

ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపాలి

తెలకపల్లి: ప్రశ్నించే గొంతుకను ఎమ్మెల్సీగా గెలిపించి శాసనమండలికి పంపాలని టీపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటురాకొండలోని కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయులతో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బలపరిచిన ఏవీఎన్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, మండల బాధ్యుడు విజయరెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, శివన్న గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రావు, మల్లేశ్ పాల్గొన్నారు.

భౌరాపురం తరలివెళ్లిన చెంచులు

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రంలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు శుక్రవారం చెంచులు భారీగా తరలివెళ్లారు. భౌరాపురంలో శివరాత్రి రోజు శివపార్వతుల కల్యాణాన్ని గత కొన్ని సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో ఉత్సవాలను నిర్వహిస్తుందన్నారు.

వ్యవసాయంలో మెలకువలు

నాగర్‌కర్నూల్‌రూరల్: వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించేందుకు మెలకువలు పాటించాలని వీకే పాలెం శాస్త్రవేత్త బి రాజశేఖర్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బొందలపల్లిలో కేవీకే పాలెం రావేఫ్ విద్యార్థినులచే ఏర్పాటు చేసిన గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మెలకువలు పాటించి అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. అనంతరం హనుమాన్ గుడి వద్ద రైతులకు, ప్రజలకు వారి గ్రామం యొక్క సామాజిక వనరులపై చిత్రపటం వేసి కాలానుగుణంగా సమయాన్ని ఆదా చేసుకుని అభివృద్ధి చెందేందుకు తీసుకోవాల్సిన మెలకువలను సూచించారు. పంట సాగు, నీటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, రావేఫ్ విద్యార్థినులు ప్రియాంక, ఉషశ్రీ, శ్రీలేఖ, విజయ, ప్రవళిక, సాయి ఇంద్రాని తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఉప్పునుంతల: యాసంగి పంటగా సాగుచేసిన వరి, వేరుశనగ తదితర పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణ కోసం సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన దిగుబడులు వస్తాయని అచ్చంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా పంటలకు ప్రస్తుతం ఆశించిన తెగుళ్ల, వాటి నివారణ చర్యలను వివరించారు. అదేవిధంగా పీఎం కిసాన్ పథకంలో ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. అనంతరం రైతు బంధు సమితి వార్షిక క్యాలండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఏఈఓ మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ చంద్రశేఖర్

సామాజిక సేవలో ప్రత్యేక పాత్ర



అన్నదానం చేస్తున్న సభ్యులు

కల్వకుర్తిరూరల్: సామాజిక సేవా కార్యక్రమాల్లో కల్వకుర్తి లయన్స్ క్లబ్‌ది ప్రత్యేక పాత్ర అని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ డి.వెంకటేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో శ్రీశైలం వెళ్లే బస్సులకు లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి పేద వారి ఆకలి తీర్చేందుకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమం అన్నదానం అని అన్నారు. దాదాపు 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి శ్రీధర్, రీజినల్ సెకరెట్రీ వెంకటస్వామి, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్, శివ, తర్నికల్ శ్రీను, రఘు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములు సాగుచేస్తున్న రైతులకు పట్టాలివ్వాలి

కొల్లాపూర్: పోడుభూములు సాగుచేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో మెమొరాండం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో దశాబ్దాల కాలంగా రైతులు పోడు భూములు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. రైతులకు ఆ భూములపై పట్టాలు లేకపోవడంతో రైతుబంధు, రైతు బీమా వంటి సంక్షేమ పథకాలను దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పోడు రైతులకు పట్టాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు బాలపీరు, సలీం, మహిమూద్, రాజు, రామకృష్ణ తదితరులున్నారు.



శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



మంచాలకట్టలో ముస్తాబవుతున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం

పెంట్లవెల్లి: మండల కేంద్రంతోపాటు మంచాలకట్ట, మల్లేశ్వరం, గోపులాపురం గ్రామాలలో శివరాత్రి సందర్భంగా పలు శివాలయాలకు నీటితో శుభ్రపరిచి విద్యుత్ లైట్లతో అలంకరణ చేస్తున్నారు. అదేవిధంగా మంచాలకట్టలోని కృష్ణానది ఒడ్డున ఉన్న ఎంతో పురాతనమైన శ్రీరామకీర్తలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తారన్నారు. అలాగే నాటక ప్రదర్శన ఉండడంతో ఆలయాన్ని ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం నిర్వహించే శివరాత్రి వేడుకల సందర్భంగా పూజా కార్యక్రమాలను ముమ్మరం చేశారు. మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో పూజలతో పాటు ఊరేగింపు నిర్వహించారు. పూజారి శంకరయ్య ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్, గుండూరు గ్రామాలలో శుక్రవారం జరిగిన శివస్వాముల ఇరుముడి కార్యక్రమంలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భజనలు చేశారు. అనంతరం ఎల్లికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో గుండూరు సర్పంచ్ కిష్టారెడ్డి, ఎల్లికల్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, గోరెటి వెంకటయ్య, సింగిల్ విండో సీఈఓ వెంకట్‌రెడ్డి, శివకృష్ణ, శ్రీపతిరాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల పరిశీలన

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో శుక్రవారం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ పార్వతమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. డంపింగ్ యార్డుల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ఎలాంటి పశువులు, మేకలు, డంపింగ్ యార్డులోకి అడుగు పెట్టకుండా చూడాలన్నారు. అనంతరం వీటి నిర్వహణపై ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు అవగాహన కల్పించారు.

ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ

వెల్దండ: మండల కేంద్రంలోని మల్లన్నస్వామి దేవాలయానికి శుక్రవారం బయ్య మల్లయ్య రూ.15వేల విలువ గల మైక్‌సెట్ బహూకరించారు. ఆలయంలో శనివారం శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కావున అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సాయన్నయాదవ్, శ్రీశైలంయాదవ్, తిరుపతయ్య, బాలకృష్ణ, మల్లేష్ తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బిజినేపల్లి: తెలంగాణ ఉద్యమ ఐక్య వేదిక రాష్ట్ర స్థాయి నంది అవార్డు అందుకున్న మండలంలోని గంగారం గ్రామానికి చెందిన ఎండీ.జాహంగీర్‌ను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి శుక్రవారం సన్మానించి సత్కరించారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల పరిధిలోని పెద్దముద్దునూరు ఉన్నత పాఠశాలలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో 2 ఫ్యాన్‌లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వపు కోశాధికారి అర్థం సాయికృష్ణ ధాతృత్వంతో ఈ ఫ్యాన్‌లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి జ్యోతి, రమణకుమార్, రీజనల్ చైర్మన్ గంధం ప్రసాద్, క్లబ్ కోశాధికారి రవికుమార్, అవోపా జిల్లా నాయకులు బాలరాజు, దర్శి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన

ఉప్పునుంతల: విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలని స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్‌లు సూచించారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులకు 3వ వారాంతాన్ని పురష్కరించుకొని జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు.

ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి శివసంకల్పం, గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, నవగ్రహ కలశస్థాపన, రక్షబంధనం, అగ్నిప్రతిష్ట తదితర పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు జంగం శివయ్య తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తెలకపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర వర్గ సభ్యుడు బుసిరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నముద్దునూరులో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను గ్రామస్థాయిలో అవగాహన కల్పించడమే ముఖ్య లక్ష్యమన్నారు. ఉజ్వల పథకం కింద పేద వారికి ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇచ్చామని, గ్రామాల అభివృద్ధి కోసం సీసీ రోడ్లు, లైట్లు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, ప్రకృతివనం లాంటి పథకాలు కేంద్ర నిధుల నుంచే గ్రామపంచాయతీకి వస్తాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు గన్నోజు నరేంద్రాచారి, కొండా నగేశ్, మండల ప్రధాన కార్యదర్శి బాబుసాగర్, బీజేవైఎం మండలాధ్యక్షులు వెంకటేశ్, శివ, నరేశ్,సత్యం, కుర్మయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్‌రూరల్: దివ్యాంగులు జీవనోపాధి వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు కందనూలు నిరంజన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉపాధి, పునరావాస పథకం కింద దివ్యాంగులు జీవనోపాధి వ్యాపారాలకు ఈనెల 28వ తేది లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గువ్వల

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. మార్కెట్ చైర్మెన్ కిషన్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం ఉన్నారు. ఉప్పునుంతలలో పోచమ్మ చౌరస్తాలో, అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేతులమీదుగా కేక్‌ను కట్ చేశారు. ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో, పెద్దకొత్తపల్లి, బల్మూర్, లింగాల, వెల్దండలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కేక్‌కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. పెంట్లవెల్లి, కోడేరు, కల్వకుర్తి, తెలకపల్లి, జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన



దుప్పట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి

ప్రతి మొక్కను సంరక్షించాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ గంగమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎటిదార్‌పల్లిలో సర్పంచ్ మనోహర్‌తో కలిసి మొక్కలకు నీటిని సరఫరా చేశారు. పల్లెప్రకృతి వనాలలో నాటిన మొక్కలను సంరక్షించడంలో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. పల్లెప్రకృతి వనాల్లో నాటిన విలువైన మొక్కలు ఆరోగ్యానికి ఉపయోగపడుతాయన్నారు.



మొక్కకు నీరు అందిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ

ఎన్నికల కోడ్‌ను పాటించాలి

పెద్దకొత్తపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోస్టర్లు, బ్యానర్లు, వాల్ రైటింగ్ చేయరాదని డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రాజకీయ పార్టీల గుర్తులపై ముసుగులు తొడగాలని, మార్చి 13 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉంటాయని ఆయన అన్నారు. కోడ్‌కు విరుద్ధంగా పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

రూ.5లక్షల చెక్కు పంపిణీ

కోడేరు: మండలంలోని రాజాపూర్‌కి చెందిన ఎంపీటీసీ బొల్లెద్దుల జయమ్మ గత కొన్ని నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 5లక్షల చెక్కును ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం మృతురాలి భర్త లక్ష్మయ్యకు అందజేశారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

అమ్రాబాద్: బీజేపీతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని జంగంరెడ్డిపల్లి, మాదవానిపల్లి గ్రామాలలో ప్రజా గోస బీజేపీ భరోసాలో భాగంగా సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గోలి రాజు, గాదె అశోక్, మల్లికార్జున్, అనీల్ తదితరులు ఉన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

కల్వకుర్తిరూరల్: డివిజన్ పరిధిలోని రంగాపూర్‌కి చెందిన ఫోటోగ్రాఫర్ పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం అచ్చంపేట తాలుకా ఫోటో యూనియన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చంద్రమౌళి, డివిజన్ అధ్యక్షుడు రవి, తాలుక అధ్యక్షుడు నారాయణగౌడ్, షరీఫ్, శ్రీనివాసులు, రమేశ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

తాడూరు: మండలంలోని మేడిపూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో కుమ్మెరలో శుక్రవారం కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మేడిపూర్ పరీక్షా కేంద్రాన్ని ఎంపిపి శ్రీదేవి పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగమయ్యేలా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.



శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ శ్రీదేవి

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ దామోదర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ మంచి పౌష్టికాహారాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయుడు బలరాంకృష్ణారావుకు తెలియజేశారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

కందనులు: జిల్లా కేంద్రంలోని ప్రీజమ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, జ్యోతి, పద్మ పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. సమావేశంలో జీహెచ్‌ఎం పాండు పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండంలోని మారేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు.

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్, అనంతవరం పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యాదగిరిరావు, ఉమామహేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం మాసమ్మ ఆధ్వర్యంలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా చేశారు. అలాగే మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తాహెర్ పాష ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులను సర్పంచ్ రవిశంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ సాబెరా బేగంలు అభినందించారు.



ఉపాధ్యాయులుగా విద్యార్థులు

చారకొండ: మండల కేంద్రంలో శుక్రవారం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, కమాలాకర్, అంజయ్య, యాదగిరి.గీత, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఎల్లయ్యగౌడ్ అధ్యక్షతన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాల పరిశీలన

కొల్లాపూర్: పట్టణంలోని గ్రంథాలయం స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాధవరం హనుమంతరావు పరిశీలించారు. ఈ మేరకు పనుల ప్రగతిని మున్సిపల్ ఏఈ విద్యాసాగర్‌రెడ్డి, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనులు దాదాపుగా పూర్తయ్యాయని కాంట్రాక్టర్ వివరించారు. అనంతరం ఆయన లైబ్రరీని సందర్శించారు. కార్యక్రమంలో లైబ్రరీయన్ సుబ్బయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు పాపల్‌రావు, రాములు, బిజ్జ దేవదాసు తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బిజినేపల్లి: ఆన్‌లైన్‌లో మోసాలకు గురైతే 24 గంటల్లో 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తిమ్మాజీపేట హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్ మోహినుద్దీన్ సూచించారు. శుక్రవారం తిమ్మాజీపేట మండలంలోని హెమ్లానాయక్‌తండాలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ బాలస్వామి, శరత్, కుమార్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

లింగాల: మండల పరిధిలోని దారారానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు శుక్రవారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ క్రీడా సామగ్రిని వితరణ చేశారు. క్రీడల్లో క్రీడాకారులను ప్రోత్సహించుటకు తన వంతుగా సహాయం అందజేయనున్నట్లు, క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో దస్తగిరి, రాంబాబు, నరేష్, వంశీ, సంజయ్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.